నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

దోమల దండయాత్ర

దోమల దండయాత్ర - వీధుల్లో తిరగలేరు..ఇళ్లలో ఉండలేరు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సాయంత్రం అయితే వీధుల్లో తిరగలేక, ఇళ్లలో ఉండలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు...

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లో దోమలు రాజ్యమేలుతున్నాయి. చిన్న ప్రాణులైన దోమల ధాటికి జనం తల్లడిల్లిపోతున్నారు. తుంగభద్ర, హంద్రీ, వక్కేరువాగు నదులు సహా కెసి కాలువల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో ప్రమాదకరమైన దోమలు పెరిగిపోయాయి. సాయంత్రం 6 గంటలు దాటితే వీధుల్లో తిరగడానికి, ఇళ్లలో ఉండటానికి వీలు కావడం లేదు. మాన్సోనియా, క్యూలెక్స్ వంటి దోమలు ఊహించని స్థాయిలో వృద్ధి చెందాయి. వీటికి తోడు చెత్తా చెదారం నిండిపోయిన మురుగు కాల్వల నుంచి, చెత్త కుప్పల మీది నుంచి గుంపులు గుంపులుగా దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇండ్లలో ఉండాలన్నా దోమల బెడదే. ఇప్పటికే 146 మంది డెంగీ బారిన పడ్డారు. 25కు పైగా మలేరియా కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా డెంగీ కేసులు నాలుగు రెట్లు అధికంగా ఉంటాయని అంచనా. క్యూలెక్స్ దోమ కాటు వల్ల 1-14 ఏళ్ల మధ్య పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అయితే ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు. దోమ కాటుతో శరీరం దద్దర్లు ఎక్కి ఇబ్బంది పడుతున్న వారు వేలల్లో ఉంటారు. దోమ జీవిత కాలం 25-30 రోజులు. లార్వా దశలోనే అంతం చేయాలి. అంటే.. నవంబరు, డిసెంబరు నెలల్లో దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించాలి. నగరం మధ్యన, అనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ నదులు, వక్కేరువాగు, కెసి కాలువ మురుగు కూపాలుగా మారి దోమల వ్యాప్తికి నిలయాలయ్యాయి. ముంద స్తుగా ఈ ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగించడం, దోమల లార్వా నిర్మూలనకు యాంటీ లార్వా మందులు పిచికారి చేయడం, ముగురు గుంటలు, కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, మురుగు కాల్వల్లో పైరిథ్రిన్ మందు, అబేట్ ద్రావణం పిచికారీ ఒక ప్రణాళిక ప్రకారం చేసి ఉంటే ఈ స్థాయిలో దోమల దండయాత్ర ఉండేది కాదు. కార్పొరేషన్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. లార్వా దశలో నిర్మూలన చర్యలు చేపట్టకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా దోమలు మనుషులపై పడి దాడులు చేస్తుంటే కార్పొరేషన్ అధికారులు 'యాంటీ లార్వా ఆపరేషన్' చర్యలకు ఉపక్రమించారు. అది కూడా తూతూమంత్రంగానే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దోమలకు ఆవాసంగా మారిన హంద్రీ

ప్రజల ఆరోగ్యాలను రక్షించాలి

దోమలు మనుషుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. దీంతో మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలు వస్తున్నాయి. దోమల ఎక్కువ కావడంతో ప్రజల అభ్యర్థన మేరకు నగరపాలక సంస్థ సిబ్బంది కాలువల్లో చెత్త తీయడం పైపైన చేస్తున్నారు. పూల బజార్, వాసవి కాలేజీ, గడియారం ఆస్పత్రి, ఉర్దూ గర్ల్స్ హై స్కూల్, అమ్మవారి శాల ప్రాంతాల్లో ఏడు అడుగుల లోతు కాలువలు ఉంటే కేవలం రెండు అడుగులు పైపైన పూడిక తీసి వెళ్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను రక్షించాలి.

- ఎస్ఎండి.షరీఫ్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు.

ఆసుపత్రుల పాలవుతున్నారు

దోమ కాటు వల్ల విష జ్వరాలు వచ్చి ఆసుపత్రి పాలవుతున్నారు. పనిచేసే బతికే మాలాంటి పేదలకు ఆరోగ్యాలు పాడైపోతే కష్టపడి సంపాదించిన డబ్బులన్నీ ఆసుపత్రుల పాలవుతున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్టి నగరంలో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలి.

- సువర్ణ, వీకర్ సెక్షన్ కాలనీ.

సాయంత్రం అయితే తలుపులు మూసుకోవాలి

రెండు నెలలుగా దోమలు పట్టి పీడిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు అనకుండా అందరికీ కుడుతున్నాయి. పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయి. సాయంత్రం ఆరు అయితే దోమల భయంతో తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మా ప్రాంతంలో మూడు నెలలైనా కాలువల శుభ్రం చేయడం లేదు. పొగ వదలక నెల రోజులైంది. జెట్టు బిళ్ళలు, ఆలవుట్, గుడ్ నైట్ లాంటివి పెట్టినా దోమలు కుడుతూనే ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులకు తెలిపినా ఏమాత్రం స్పందించడం లేదు. ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలి.

- సి.జయమ్మ, కవాడి వీధి.

దోమల వృద్ధి తగ్గుముఖం పట్టింది

రెండు వారాలుగా నివారణ చర్యలు చేపట్టాం. దోమల వృద్ధి తగ్గుముఖం పట్టింది. మరో రెండు వారాల్లో పూర్తిగా నిర్మూలిస్తాం. గుర్రపు డెక్కను తీసేందుకు అదనంగా 40 మంది సిబ్బందిని నియమించాం. హంద్రీ, తుంగభద్ర నదులలో గుర్రపు డెక్కను తీసి ఒడ్డుకు వేయడంతో ఎండిపోతుంది. జోరాపురం బ్రిడ్జి దగ్గర, తుంగభద్రా నదిలో ఇంకా గుర్రపు డెక్క ఉంది. వాటిని కూడా తీసే ప్రయత్నం చేస్తున్నాం. రాత్రింబగళ్ళు దోమల నివారణ కోసం యాంటీ లార్వా మందులను పిచికారి చేస్తున్నాం. మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. ఫాగింగ్ కోసం అదనంగా పది మిషన్లను కొన్నాం. పాతవి మరో 10 మొత్తం 20 మిషన్లలో 16 డివిజన్లకు 16 మిషన్లను, విఐపి వారి కోసం అదనంగా ఒక మిషన్‌ను ఉపయోగించి పనిచేస్తున్నాం. దోమలు నివారణ కోసం పది ట్రాక్టర్ల ద్వారా మురికి కాలువల్లో ఫాగింగ్ చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, సీనియర్ ఎంటమాలజిస్ట్.

బిజెపిని ఓడించండి

- కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక, రైతు సంఘాల నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న రైతులపై ఉక్కు పాదం మోపుతున్న బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని కార్మిక, రైతు సంఘాలు కోరాయి. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు నరసింహులు, చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, రైతుసంఘం నాయకులు కృష్ణ, నాగేంద్ర, పంపన్న గౌడ్ మాట్లాడారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తోందని మండిపడ్డారు. రైతులపై భాష్ప వాయువులు ప్రయోగించి, సౌండ్ బాంబులు ప్రయోగించి, కాల్పులు జరుపుతూ వందల మంది రైతులను గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు శుభకరన్ సింగ్‌ను చంపేశారని తెలిపారు. ఇది ఒక దారుణమైన చర్య అని విమర్శించారు. రైతులపై యుద్ధం చేసే పరిస్థితికి బిజెపి ప్రభుత్వం దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు క్షమాపణ చెప్పి రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు గోపాల్, సుధాకరప్ప, రాధాకృష్ణ, రామాంజనేయులు, పురుషోత్తం, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు ఉమాదేవి పాల్గొన్నారు.

25న గ్రూప్-2 పకడ్బందీగా పరీక్ష

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 25న గ్రూప్-2 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జెసి నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 25న ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కర్నూలు నగరం, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనిలోని 126 కేంద్రాల్లో 36 వేల మంది గ్రూపు-2 పరీక్షలు రాస్తున్నారన్నారు. విశాఖపట్నం తర్వాత కర్నూలు జిల్లాలోనే అధికంగా ఈ పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. 2, 3 కేంద్రాలను కలిపి 34 రూట్లుగా విభజించి, 34 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించినట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాలను ట్రెజరీలో డిపాజిట్ చేస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాలను, ఒఎంఆర్ సీట్లను, రూట్ ఆఫీసర్స్ ఉదయం 5 గంటలకు ట్రెజరీ నుంచి తీసుకొని కోడ్ నెంబర్ల ప్రకారం ఏ కేంద్రానికి సంబంధించిన ఒఎంఆర్ షీట్లను, ప్రశ్నాపత్రాలను ఆ కేంద్రాలకు పోలీసు సెక్యూరిటీతో తీసుకెళ్లి పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్లకు అందజేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్స్ తెరవకుండా చూడాలన్నారు. 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా అవసరం ఉన్నచోట ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు రాసే అభ్యర్థులు 15 నిమిషాలు ముందే పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు. స్మార్ట్ వాచెస్, మొబైల్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాలులోకి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. ఎపిపిఎస్‌సి డిప్యూటీ సెక్రటరీ సి.కొండారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ నాగరాజు, డిఆర్ఒ కె.మధుసూదన్ రావు, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ డిల్లేశ్వరరావు, రూట్ ఆఫీసర్స్, లైజనింగ్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి మౌర్య

అంతర్జాతీయ స్థాయి విద్యాబోధన

మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

- ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వర్సిటీ విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో టెక్‌ఫెస్ట్ 2కె47 కార్యక్రమం ఏర్పాటు చేశారు. హేమచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎడిక్స్ సంస్థతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ఒక్కో విద్యార్థికి రూ.30 వేలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన కార్యక్రమాలను కూడా విద్యార్థుల కోసం పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి వర్సిటీకి కళాశాలకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. వర్సిటీ వైస్ ఛాన్సిలర్ సుధీర్ ప్రేమ్ కుమార్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.హరి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యనగర్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కర్నూలు నగరంలో సమ్మె నిర్వహించారు. ఈ సమ్మె సందర్భంగా జరిగిన సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు సంపూర్ణ మద్దతును తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు హనుమంత రెడ్డి అధ్యక్షతన స్థానిక భాగ్యనగర్‌లోని బ్యాంకు రీజనల్ కార్యాలయం దగ్గర జరిగిన సభలో అంజిబాబు మాట్లాడారు. డైలీవేజ్ కింద పని చేసే వారిని రెగ్యులర్ చేయాలని, కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, పూర్తి పెన్షన్ అమలు చేయాలని, గ్రాడ్యుటీ సర్వీసు రూల్ ప్రకారం చెల్లించాలని కోరారు. అర్హులైన వారికందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, తగినంత సిబ్బందిని భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో చేస్తున్న ఆందోళన ఎంతో న్యాయమైన దన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ఇప్పటికే సిఐటియు అనేక పోరాటాలను చేసిందన్నారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల పోరాటం విజయవంతంకావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసేవి గా ఉన్నాయన్నారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న రైతు ఉద్యమాలను ఆయన ఉటంకించారు. ఉద్యమాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం చేసుకోగలమని, భవిష్యత్తు కాలంలో కూడా ఉద్యమాలకు ఉద్యోగులు కార్మికులు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. జనరల్ ఇన్స్యూరెన్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జంధ్యాల రఘుబాబు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలో పొదుపు మహిళల 813 గ్రూపులకు కోడుమూరు వైసిపి నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, సతీష్ శుక్రవారం చెక్కు పంపిణీ చేశారు. సుమారు రూ.నాలుగు కోట్ల 71 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, పొదుపు గ్రూపులకు వరమని అన్నారు. అనంతరం వాలంటైర్లకు వజ్ర, రత్న, రజత పత్రాలు అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న నీళ్ల ట్యాంకర్

ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలు

పిపిఎస్ఎస్, డివైఎఫ్ఐ సహకారంతో ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్/కర్నూలు క్రైమ్

నంద్యాల చెక్ పోస్ట్ నుండి నందికొట్కూరు రోడ్డుపై శుక్రవారం గణేష్ గుడి ఎదుట నీళ్ల ట్యాంకర్ ఆటోను ఢీకొనడంతో ఎల్లమ్మ గుడికి వెళ్లే ముగ్గురు మహిళలు, ఒక వలస కార్మికుడు ఆటోలో ఇరుక్కొని పోయి నరకం అనుభవించారు. నగర పర్యటనలో ఉన్న పిపిఎస్ఎస్, డివైఎఫ్ఐ ప్రతినిధి బృందం, స్థానిక ప్రజలు ఆటోకు ట్యాంకర్‌కు మధ్య ఇరుక్కున్న నలుగురు పెద్దలను, ఇద్దరు పిల్లలను బయటికి తీసి 108 వాహనం పైకి ఎక్కించి ప్రభుత్వ హాస్పటల్‌కు పంపారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తగినంత శ్రద్ధ పెట్టనందువల్ల నగర రోడ్లపై ప్రతిరోజు ప్రమాదాలు అవుతున్నాయని పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పల్లారెడ్డి, నగర నాయకులు ఎం.యాకోబ్, నరసయ్య, శశి కుమార్ రెడ్డి విమర్శించారు. విస్తరణకు నోచుకోక ఇరుకుగా ఉండే నందికొట్కూరు రోడ్డు ట్రాఫిక్ సమస్యలపై పట్టణ పౌర సంక్షేమ సంఘం, డివైఎఫ్ఐ ప్రతినిధి బందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సమస్త పరిధిలోని రోడ్లు భవనాల శాఖకు చెందిన ప్రధాన రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. రోడ్డు టాక్స్,పెట్రోల్ డీజిల్ పై రోడ్డు సెస్సు వసూల్ చేయడంతో పాటు రోడ్ల అభివృద్ధి పేరుతో అప్పులు చేసిన వేల కోట్లు ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లించిన ఇంటి పన్నుల సమకూరిన నిధులతో ఆర్అండ్‌బి రోడ్లు అభివృద్ధి ఎక్కడ చేస్తున్నారని విమర్శించారు. నందికొట్కూరు రోడ్డు కిరువైపులా మురుగు నీరు నిలిచి పచ్చి గడ్డి మొలసి కొన్నిచోట్ల 30 అడుగుల రోడ్డు మాత్రమే ఉండడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కర్నూలుకు ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, రోడ్ల అభివద్ధి పై శ్రద్ధ పెట్టడం లేదని స్థానిక ప్రజలు శాపనార్థాలు పెట్టారు. పదవి కాలం ముగిస్తున్న అధికార వైసిపి ప్రజాప్రతిథులందరూ ముఖ్య మంత్రి పై ఒత్తిడి తెచ్చి కనీసం రూ.10 కోట్లయినా మంజూరు చేయించి రోడ్ల విస్తరణ కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ పర్యటనలో డివైఎఫ్ఐ నాయకులు హుస్సేన్‌బాష, వీరేష్, పిపిఎస్ఎస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పిపిఎస్ఎస్, డివైఎఫ్ఐ నాయకులు

కెవిఆర్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇజ్రాయిల్ , పాలస్తీనా యుద్ధ నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కె.వి.ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులు పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మురళీధర్ తో పాటు ప్రముఖ పారిశ్రామిక వేత టీజీ భరత్ పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఇలాంటి అంశాన్ని ఎంచుకొని సదస్సు నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఇలాంటి అంశాలపై విద్యార్థులు మరింత అధ్యయనం చేయాలని వారు కోరారు. ఇజ్రాయిల్ పాలస్తీనా సమస్య నివారణకు ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ముందుకు వచ్చే శాంతి నెలకొల్పేందుకు దష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి వి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో డాక్టర్ నజీరుద్దీన్ , డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ ఖాజాముద్దీన్, డాక్టర్ జ్యోతిర్మయి , డాక్టర్ పార్వతీదేవి, డాక్టర్ ప్రతిమ రాయ్ , డాక్టర్ సునీత రోస్ , డాక్టర్ జవహర్ , మానస రెడ్డి ఈ అంశంపై పత్రాలను సమర్పించారు.

సామూహిక రాజీనామాలకు రంగం సిద్ధం

ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అనుచరులు, కార్పొరేటర్ల అసంతృప్తి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు వైసిపిలో రాజకీయ అలజడి మొదలయ్యింది. గత కొద్దిరోజులుగా ఎమ్మెల్యే టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఆయనకు అధిష్టానం మొండి చేయి చూపినట్లు తెలుస్తోంది. గురువారం పార్టీ అధిష్టానం విజయవాడకు పిలుసుకొని ఆయనతోనే ఆయనకు టికెట్ లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన అక్కడి నుండి మనస్థాపంతో వెళ్లిపోయినట్లు ఆ పార్టీ క్యాడర్లో చర్చ జరుగుతోంది. ఆయన స్థానంలో మరో కొత్త వ్యక్తిని ప్రకటించే యోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు చర్చ జరుగుతుంది. దాదాపు ఇదే విషయం క్యాడర్‌కు సంకేతాలు అందడంతో కర్నూలు నియోజకవర్గంలో హాఫీజ్ ఖాన్ అనుచరులు, కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన అనుచరులు ప్రజాప్రతినిధులు కార్పొరేటర్లు రాయల్ ఫంక్షన్ హాల్లో సమావేశమై తదుపరి నిర్ణయం పట్ల చర్చించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లు మూకుమ్మడిగా రాజీనామాలకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే వారి నుంచి రాజీనామాల కోసం సంతకాలు సేకరించారు. అధిష్టానం జిల్లా పార్టీ పెద్దలనుంచి బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వక పోతే తిరుగుబాటు అభ్యర్థిగా మారుతారా? పార్టీ అధిష్టానానికి మాటకు విలువనిచ్చి సర్దుకుపోతారా అన్న అంశం తేలాల్సి ఉంది.

హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ రాకుంటు రాజీనామా!

కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్‌కు ఎమ్మెల్యే సీటును కేటాయించకపోతే రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని కర్నూలు డివిఎంసి మెంబర్ కె ప్రభుదాసు అన్నారు. పార్టీని ప్రారంభించినప్పటి నుండి ఎమ్మెల్యే పార్టీ జెండాను భుజాలపై మోసిన వ్యక్తి హాఫీజ్‌ఖానన్న అని అన్నారు. ఆయనకు కాకుండా ఎవరెవరికో టికెట్ ఇస్తామంటే సహించేది లేదన్నారు. పార్టీ అధిష్టానం పునరాలోచించి టికెట్ ప్రకటించాలని కోరారు.

గౌరు దంపతులకు వినతి ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు రవికుమార్, హేమంత్

ఒపిఎస్‌కు మద్దతివ్వండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీంలో అమలు చేసేందుకు మద్దతు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ,నవీన్ పాటి కోరారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గౌరు చరితను యుటిఎఫ్ ప్రతినిధి బృందం కలిసి ఒపిఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా నాయకులు తిమ్మన్న, రఫీక్, ఓర్వకల్, కల్లూరు మండలాలకు చెందిన నాయకులు ఉన్నారు. ఒపిఎస్‌కు మద్దతిస్తేనే రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే వారికి మద్దతిస్తామని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు.

టిజి భరత్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

రానున్న ఎన్నికల్లో పోలింగ్ రోజు ప్రజలకు సైకిల్ గుర్తు, తాను మాత్రమే కనిపించాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. నగరంలో ఆయన రెండవ విడత సైకిల్ యాత్ర చేపట్టారు. ఉస్మానియా కాలేజీ సమీపంలోని టిజి వెంకటేష్ మైనారిటీ షాదీఖానా నుండి యాత్ర ప్రారంభించి గుమ్మజ్‌లో ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నూల్లో తాను చేపట్టిన సైకిల్ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన వస్తోందన్నారు. కర్నూల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ స్థంబాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ట్రాఫిక్, నిరుద్యోగం సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ పదేళ్లలో నగరం ఎంతో వెనుకబడిపోయిందన్నారు. తాను గెలిచాక ఈ సమస్యలన్నీ క్రమ పద్ధతిలో పరిష్కరిస్తానని ప్రజలకు భరోసా ఇస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలకు

వాలంటీర్లు బ్రాండ్ అంబాసిడర్లు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించిన వాలంటీర్లకు బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తింపు ఇవ్వడానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సంత మార్కెట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ స్వరాజ్యం పేరుతో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను వాలంటీర్ల ద్వారా ఇంటింటికీ చేర్చినట్లు తెలిపారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలను పొందని గడప లేదని, అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా అందించిన ఘనత జగన్‌కే దక్కిందని చెప్పారు. చంద్రబాబు మాయ మాటలకు మోసపోవద్దని, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ సినిమా డైలాగులకు మాత్రమే పనికి వస్తారని విమర్శించారు. ఎమ్మెల్యే తనకు నాలుగోసారి అవకాశం ఇచ్చి ఆదరించాలని కోరారు. ప్రజా సేవకే తమ కుటుంబ సభ్యులు జీవితం అంకితమని, రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ ఎస్.విశ్వనాథ్ రెడ్డి, ఎంపిపి గోపినాథ్, సర్పంచి తెల్లబండ భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయం

- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ విరుపాక్షి తెలిపారు. శుక్రవారం మండలంలోని హలిగేర, నగరూరు, అట్టెకల్లు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా గ్రామాల్లో వైసిపి నాయకులు పూల మాలలు వేసి, బాణాసంచా కాలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని తెలిపారు. మరోసారి ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే రాష్ట్రం మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యేగా గెలిపించి జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. జడ్‌పిటిసి దొరబాబు, ఆస్పరి, చిప్పగిరి మండల కన్వీనర్లు పెద్దయ్య, మారయ్య, కోకన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న విరుపాక్షి

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 32వ వార్డులో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని, దీనికోసం ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. వార్డు కౌన్సిలర్ కీర్తన, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

- విద్యుత్ శాఖ విజిలెన్స్ పర్యవేక్షణ ఇంజనీర్ తిరుపతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ పర్యవేక్షణ ఇంజినీర్ తిరుపతి శ్రీనివాస్ బాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మిగనూరు తాలూకా పరిధిలోని పట్టణంలో, వెంకగోడు, కందనాతి, హెచ్.కైరవాడి, కోడుమూరు, కలుగొట్ల, నాగలాపురం తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వీటిలో 42 సర్వీసులు అదనపు లోడు గాను రూ.1,46,000, 10 సర్వీసులు మాల్ ప్రాక్టీస్ కింద రూ.56 వేలు, 32 సర్వీసులు విద్యుత్ చౌర్యానికి గాను రూ.67 వేలు జరిమానా విధించారు. ఈఈ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పర్యవేక్షణ ఇంజనీర్ తిరుపతి

వేసవి రాకముందే..!

- తాగునీటికి తప్పని తిప్పలు
- సమస్య జటిలం కాకముందే పరిష్కరించాలంటున్న ప్రజలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

వేసవి ప్రారంభం కాకముందే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. తాగునీటి సమస్య జటిలంగా మారడంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గోనెగండ్ల మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పెద్దమరివీడు, బి.అగ్రహారం, ఐలవాల, కులుమాల, చిన్నమరివీడు, బి.అగ్రహారం, ఐరావుల, గంజిహళ్లి, ఐరన్‌బండ, గోనెగండ్ల గ్రామాల్లో నీటి కుళాయిలు, బోరు బావులు, ట్యాంకుల దగ్గర 4, 5 రోజులకోసారి వచ్చే తాగునీటి కోసం ప్రజలు ఖాళీ బిందెలతో పడిగాపులు కాస్తున్నారు.

జలజీవన్ మిషన్‌తోనైనా సమస్య తీరేనా..?

మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం జల జీవన్ మిషన్ కింద పనులకు శ్రీకారం చుట్టింది. గోనెగండ్ల మండలంలో రూ.38 కోట్లతో 28 పనులు మంజూరు కాగా 10 గ్రామాల్లో పనులు చేపట్టారు. ఈ పనులు వివిధ కారణాలతో నత్తనడకన సాగుతున్నాయి. ఇంటింటికీ కుళాయి పేరుతో చేపట్టిన పనుల్లో భాగంగా కొన్ని గ్రామాల్లో నీటిని సరఫరా చేసే పైపులైనుల్ల దెబ్బతిని తాగునీటి సమస్య మరింత జటిలంగా మారింది. వేసవి తీవ్రత పెరిగి తాగునీటి సమస్య ఇబ్బందికరంగా మారకముందే అధికారులు పనులను త్వరగా పూర్తిచేసి మండలంలోని గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

> వేసవి ఆరంభం కాకముందే గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రారంభమైంది. ఈ ఏడాది సరైన వర్షాలు కురవలేదు. పరిస్థితిని గమనించి ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన పాలకులు, అధికారుల్లో నిర్లక్ష్యం నెలకొంది. ప్రజలకు తాగునీటి వెతలు తప్పడం లేదు. బోరు, బావుల వద్ద, కుళాయిల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వ హామీ అటకెక్కింది.

గోనెగండ్ల మండల బి.అగ్రహారంలో నీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

హంద్రీ నుంచి పైపులైన్ వేసి శాశ్వత పరిష్కారం చూపాలి

- కె.గోవిందు, బి.అగ్రహారం

మా గ్రామంలో సుమారు 4 వేల జనాభా ఉంది. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అన్ని కాలాల్లో నీటి సమస్య వేధిస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే నీటి సమస్యను పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు సమస్యను పరిష్కరించకుండా గాలికి వదిలేస్తున్నారు. గ్రామంలో 3 బోర్లు ఉన్నప్పటికీ భూగర్భ జలాలు ఇంకిపోయాయి. నీటి సరఫరా లేకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చినా ప్రయోజనం ఉండదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమీప తెర్నేకల్ హంద్రీ నుంచి ప్రత్యేక పైపు లైను ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

సమస్య పరిష్కారానికి చర్యలు

- శ్రీనివాస రెడ్డి, ఎఇ ఆర్‌డబ్ల్యుఎస్

మండలంలోని 23 గ్రామాల సచివాలయాల పరిధిలో జలజీవన్ మిషన్ కింద 28 పనులు మంజూరయ్యాయి. వీటిలో 25 పనులకు అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. 11 పనులను ఇప్పటికే ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా ప్రారంభించి, పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆస్పరి మండలంలో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

పుప్పాల దొడ్డిలో దాహం.. దాహం...

- గుక్కెడు నీటి కోసం.. గంపెడు కష్టాలు

ఆస్పరి : వేసవి రాకముందే పల్లె వాసులకు నీటి కష్టాలు తగ్గడం లేదు. ప్రభుత్వం ప్రజల మౌలిక వసతులు తీరుస్తామని ఆర్భాటంగా హామీలు ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. ఆస్పరి మండలం కైరుప్పల మజరా గ్రామమైన పుప్పాలదొడ్డిలో గత మూడు నెలలుగా నీటి సమస్య నెలకొంది. నీటి సమస్యతో ప్రజలు తలడిల్లిపోతున్నా పాలకులు, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

గుక్కెడు నీటి కోసం...

పుప్పాల దొడ్డి గ్రామంలో 130 కుటుంబాలు ఉండగా 947 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామానికి ప్రధానంగా నీటి సరఫరా కోసం గ్రామ సమీపంలోని చెరువులో రెండు బోర్లు వేయించారు. చెరువులో భూగర్భ జలాలు అడుగంటడంతో అరకొర నీరే సరఫరా అవుతోంది. ఆ అరకొర నీరు గ్రామస్తుల దాహార్తిని ఏ మాత్రం తీర్చలేకపోతోంది. గ్రామానికి ప్రత్యామ్నాయంగా నీరు లేకపోవడంతో వ్యవసాయ బోర్లపై ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. వ్యవసాయ బోర్లకు ఉదయం పూట విద్యుత్ సరఫరా తక్కువగా ఉండడంతో రాత్రిపూట ఎక్కువగా ఉంటోంది. రాత్రి అయినప్పటికీ జాగరణ చేసి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి కోసం ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి ప్రత్యేకంగా ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఉంది.

నీటి సమస్యను పరిష్కరించండి

- రామాంజనేయులు, పుప్పాలదొడ్డి గ్రామస్తుడు

మా గ్రామంలో 130 కుటుంబాలు ఉన్నాయి. తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. బిందెడు నీటి కోసం రాత్రనకా, పగలనక కుళాయి దగ్గర వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

హంద్రీలో బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ

అలారుదిన్నె హంద్రీలో బోరు వేసి పుప్పాల దొడ్డి గ్రామానికి నీటి సరఫరా చేయాలి. ఆ గ్రామానికి ప్రత్యామ్నాయ మార్గం హంద్రీ నుంచి పైపు లైన్ వేసి నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

టిడిపికి బీసీలే వెన్నెముక

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం

టిడిపికి అప్పటికి, ఇప్పటికి ఎప్పటికైనా బీసీలే వెన్నెముక అని, బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఏకైక పార్టీ టిడిపి అని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం నందవరంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర రావు యాదవ్, టిడిపి బీసీ సెల్ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, కర్నూలు పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు జగదీష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏ పార్టీలో లేనంతగా బీసీలు టిడిపిలో ఉన్నారని, అధికార వైసిపి తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటూ బీసీలను నట్టేట ముంచిందని విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో పదవులన్నీ అగ్రవర్ణాల వారికి కేటాయించి, ఇప్పుడు కొత్తగా బీసీలకు అగ్రస్థానం కల్పిస్తున్నామని చెప్పి కపట నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఈనెల 25న ఉదయం 11 గంటలకు ఎంఆర్‌సి కన్వెన్షన్ హాలులో కర్నూలు పార్లమెంట్ పరిధిలో గల 7 నియోజకవర్గాల బీసీ నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణ, మండలాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఇదేనా అభివృద్ధి జగన్ రెడ్డి..?

'పల్లెనిద్ర'లో భాగంగా నందవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బీవీ పర్యటించారు. కాలనీల్లో సరైన డ్రెయినేజీ లేక సొంత డబ్బులతో ప్రజలు డ్రెయినేజీ నిర్మించుకున్నారని, ఇది వైసిపి పాలన లోపానికి నిదర్శనమని తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో తిరిగి సమస్యలను అడిగి తెలుసుకొని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాలు, తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పల్లెనిద్రల ద్వారా ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గల జామియా మసీదులో ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు మాధవరావు దేశాయి, నాగరాజు గౌడ్, గురు రాజా దేశాయి, ఖాసీం వలీ, ధర్మాపురం గోపాల్, మస్తాన్, రెహమాన్, వీరేష్, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీవీ, బీసీ నాయకులు

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చి అమలు చేయండి

- మాజీ ఎమ్మెల్యే బీవీకి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రకటించబోయే మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని చేర్చి, అమలు చేసే విధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి నివాసంలో యుటిఎఫ్ నాయకులు ఎన్.నాగమణి, ఎస్.దావీదు, జె.ఎల్లప్ప, నరసింహులు ఆధ్వర్యంలో 100 మంది యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రకటించబోయే మేనిఫెస్టోలో ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసే విధంగా టిడిపి ప్రకటించాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ 'ఓట్ ఫర్ ఒపిఎస్' అనే నినాదం ద్వారా మద్దతు పలుకుతామని తెలిపారు. టిడిపి రాష్ట్ర నాయకత్వం దృష్టికి పాత పెన్షన్ విధానాన్ని తీసుకెళ్లి మేనిఫెస్టోలో చేర్చే విధంగా చొరవ చూపాలని కోరారు. బీవీ స్పందిస్తూ... ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం టిడిపి ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న, వై.రామాంజినేయులు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజు, అబ్దుల్ లతీఫ్, చంద్రపాల్, ఎస్.ప్రసాద్, గురుస్వామి, నీలి నాగరాజు, పాపయ్య, పరిగె ప్రకాష్, అల్లాబకాష్, పి.పెద్దారెడ్డి, విజయ్ కుమార్, రంగన్న పాల్గొన్నారు.

బీవీకి వినతి పత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కుంకనూరును సందర్శిస్తున్న వైద్య సిబ్బంది

కుంకనూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కుంకనూరు గ్రామంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇద్దరి బాలురకు డెంగీ జ్వరం సోకడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వైద్య సిబ్బంది జయలక్ష్మి, శ్రీధర్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సబ్ యూనిట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు పిచికారి చేయించారు. పంచాయతీ సెక్రటరీ మద్దిలేటి రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- 672 టెట్రా ప్యాకెట్లు, కారు స్వాధీనం
- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరికి వచ్చే రోడ్డు సమీపంలో ఎపి 2 డిడి 5170 నెంబర్ గల మారుతి సుజుకి షిఫ్ట్ వాహనంలో ఏడు పెట్రా కర్ణాటక మద్యం బాక్సులు, 672 టెట్రా కర్ణాటక ప్యాకెట్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం నుంచి చిప్పగిరికి కర్ణాటక మద్యం తరలిస్తుండగా చిప్పగిరి గ్రామానికి చెందిన కొండ రాము, కొండ సాయికుమార్‌ను అరెస్టు చేసి, వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు యశ్వంత్, మదర్ సాహెబ్, భాస్కర్, రామోజీ, హోంగార్డు శంకర్ పాల్గొన్నారు.

నిందితులతో ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, సిబ్బంది

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

- విజేతగా నిలిచిన వరదాయ పల్లి వృషభాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్టాపన సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. వరదాయ పల్లి బెస్త శ్రీరాములు వృషభాలు విజేతగా నిలిచాయి. రూ.50 వేల బహుమతి దాత నీలకంత గౌడ్ అందజేశారు. తెలంగాణ రాష్ట్రం గొర్ల ఖాన్ దొడ్డి గ్రామానికి చెందిన కురువ కర్రెప్ప వృషభాలు ద్వితీయ స్థానంలో నిలువగా రూ.40 వేలు దాత రాజేష్, దేవనకొండ మండలం బెల్లందొడ్డి గ్రామానికి చెందిన దర్గయ్య వృషభాలు మూడో స్థానంలో నిలువగా రూ.30 వేలు దాత నరసయ్య గౌడ్, అనంతపురం జిల్లా బొందలదిన్నె రేగడ కొత్తూరు వృషభాలు నాలుగో స్థానంలో నిలువగా రూ.20 వేలు దాత సుల్తాన్, నంద్యాల జిల్లా పగిడాల గ్రామానికి చెందిన కోరల గిరిజ వృషభాలు ఐదో స్థానంలో నిలువగా రూ.10 వేలు దాత జూటూరు రంగముని అందించారు. ఈ రాతిదూలం లాగుడు పోటీలు తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఆర్గనైజర్ రామదాస్ గౌడ్

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామానికి చెందిన మునిస్వామి, రేణుకమ్మ దంపతులకు వైసిపి నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి... మునిస్వామి హైదరాబాదులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో గ్యాస్ట్రాలజీ (పేగుకు సంబంధించిన వ్యాధి) ఫౌండేషన్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డిని సంప్రదించి ఆర్థిక సహాయం చేయాలని మునిస్వామి దంపతులు కోరారు. తక్షణమే స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రుణపడి ఉంటామని మునిస్వామి దంపతులు తెలిపారు. వైసిపి దొడ్డనకేరి నాయకులు సుందర్రాజు, మునిస్వామి, ఉలిగప్ప పాల్గొన్నారు.

వైసిపికి గుమ్మనూరు అనుచరుల రాజీనామా

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ అనుచరులు వైసిపి రాజీనామా చేస్తున్నట్లు వైసిపి ఆలూరు మండల మాజీ కన్వీనర్ వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను, కార్యకర్తలను అవమాన పరుస్తున్నారని తెలిపారు. విలువ లేనిచోట తాము ఉండలేమని, మాజీ కన్వీనర్లు, సచివాలయ, వార్డు మెంబర్లు, కార్యకర్తలు 20మంది దాకా వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ, జగనన్న కోసం పని చేశామని, కొంతమంది జిల్లా నాయకులు, మీడియా పనిగట్టుకొని తమను అవమానపరుస్తున్నారని తెలిపారు. బొగ్గుల ఈరన్న, హనుమయ్య, కుప్పగల్లు మల్లేష్, వెంకటేశులు, గోవిందు, బీరప్ప, దుబ్బలింగ, శ్రీనివాసులు, దీపక్ పాల్గొన్నారు.

'వికలాంగుల సింహగర్జనను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 29న వికలాంగుల హక్కులు, డిమాండ్ల సాధన కోసం కర్నూలులో జరిగే వికలాంగుల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. శుక్రవారం గోనెగండ్లలో వికలాంగుల సింహ గర్జన సభకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వికలాంగులు మాట్లాడారు. వికలాంగుల హక్కులను, డిమాండ్లను పోరాడి నెరవేర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఇందుకోసం ప్రతి వికలాంగుడూ ఈనెల 29న కర్నూలులో జరిగే వికలాంగుల సింహ గర్జన సభకు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సభా ప్రాంగణం వద్ద ఉచిత భోజనం వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల నాయకులు రాముడు, రంగన్న, నరసింహుడు, రంగేష్, గోవిందు, సన్నప్ప, బాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా రథంగా హోమం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సాల్లో భాగంగా శుక్రవారం రథంగా హోమం, రథంగాబలి వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం నిర్వహించారు. రథాన్ని కొంచెం ముందుకు కదిలించింది పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ ఆర్.హనుమంత రెడ్డి మాట్లాడుతూ... శనివారం స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు చింతమాను మహాలింగడు, లక్ష్మి, పండితులు విద్యాధర స్వామి, పులికొంద, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు జిల్లా అవుట్ డోర్ స్టేడియంలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కర్నూలు ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని కర్నూలు జిల్లా కబడ్డీ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, సుభాకర్, జాయింట్ సెక్రటరీ అమర్ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం వారు ఆదోనిలో మాట్లాడారు. 70వ ఆంధ్రప్రదేశ్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ పోటీలు నెల్లూరులో మార్చి 8 నుంచి 10 వరకు జరుగుతాయన్నారు. పురుషులు 85 కిలోలలోపు ఉండాలని, ఆధార్ కార్డు తీసుకు రావాలని తెలిపారు. ఇతర వివరల కోసం 9701012329 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉర్దూ, కన్నడ కొనసాగింపునకు కృషి

- ఆర్‌యుటిఎ నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

ఉర్దూ, కన్నడ మీడియాలను యథావిధిగా కొనసాగించేందుకు కృషి చేస్తామని రాయలసీమ ఉర్దూ టీచర్ అసోసియేషన్ నాయకులు ఆకిబ్, కార్యదర్శి నిషార్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఈబీసీ కాలనీ ఉర్దూ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిబిఎస్ సిలబస్ వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి విద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత విద్యాధికారులతో చర్చించి ఉర్దూ, కన్నడ మీడియాలు యథావిధిగా కొనసాగించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు ముస్లిం పెద్దలు ఈసా, అమిత్ బాష, రహిమాన్, చికెన్ మాబాష, షఫీ, బషీర్, రహంతుల్లా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తల్లిదండ్రులు పాల్గొని సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారికి సమర్పించారు.

'జయహో బీసీ' మహాసభను జయప్రదం చేయండి

- టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తిమ్మప్ప

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు నగరంలోని ఎంఆర్‌సి ఫంక్షన్ హాలులో 25న జరిగే 'జయహో బీసీ' మహాసభను జయప్రదం చేయాలని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.తిమ్మప్ప కోరారు. శుక్రవారం ఆదోనిలోని టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు స్వగృహం వద్ద సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు సూచనల మేరకు జరుగుతున్న జయహో బీసీ మహాసభకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు, టిడిపి బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర హాజరవుతారని తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున కర్నూలుకు తరలిరావాలని కోరారు. ఆరెకల్ రామకృష్ణ, గోనబావి గోపాల్, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు చాంద్, హనుమాన్ సింగ్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 4TH ADDL DIST JUDGE KURNOOL.
M.V.O.P. No. 393 of 2023
S. Mahabee & Others ... Petitioners
Vs
1) APSRTC
2) M. Eranna ... Respondents

NOTICE TO R2

Mandula Eranna APSRTC Driver
S/o. Narasimhapaa, RTC Driver, Pathikonda (Depot), KUROOL (Dt.)

పై కేసుల పిటీషనర్స్ 12-07-2022న జరిగిన Accdient లో S.M. Badesavali చనిపోయినందున, నష్టపరిహారం కొరకు మీ పైన మరియు R1 పైన, పై పిటిషన్ M.V.O.P. 393/23 పై కోర్టులో దాఖలు చేసినారు. సదరు కేసు వాయిదా 11-04-2024 ఉన్నది. కావున మీరు 11-04-2024 ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు హాజరైయి, మీకు ఆక్షేపణలున్న యెడల తెలియపరచుకొనవచ్చును. లేనిచో, కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వై. శ్రీనివాసులు
పిటిషనర్స్ అడ్వకేటు, కర్నూలు.
సెల్ : 9440768473

IN THE COURT OF THE IIADJ: CUM MOTOR VEHICLE ACCIDENT CLAIMS TRIBUNAL KURNOOL, AT ADONI
I.A. No. 59/2024
M.V.O.P. No. 11/2018
Between,
Ediga Seenappa ....Petitioner
Verses
Katika Nagaraju and 2 others .... Respondents

NOTICE TO RESPONDENTS NO.2

To
Erappa Ediga
S/o Ediga Thippanna,
Hindu, aged about 50 years,
Owner of the Trailer Mahindra Maximo BSIII bearing No.AP21 TU 8482,
Resident of H.No.21-514-98, Ambedkar Nagar, Adoni Town, Kurnool District, Andhra Pradesh State. (RESPONDENT No.2)

Whereas the above named petitioner filed the above MVOP case against you No.2 and others for recovery of accident compensation amount. You are hereby noticed to Respondents No.2 to appear before this Hon'ble Court on 29.02.2024 at 10.30 A.M. either in person or through an Advocate to file any objection. If you fail to appear, the case will be heard and decided ex-parte.

//BY ORDER OF THE COURT//

SRI K.HANUMESH
SMT. K.LAVANYA
ADVOCATES FOR PETITIONER
ADONI,
KURNOOL DIST.

ప్రజాశక్తి

శనివారం 24 ఫిబ్రవరి 2024

5

నంద్యాల

వాలంటీర్లకు పురస్కారాల ప్రదానం చేస్తున్న మంత్రి బుగ్గన

పెరుగుతున్న... ఎండల తీవ్రత

- జాగ్రత్తలు తీసులోవాలని వైద్యుల సూచనలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుండే ఎండల వేడి పెరిగింది. రోజువారీగా 35డిగ్రీలు,36 డిగ్రీలు ఇలా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి.

శుక్రవారం మధ్యాహ్నం జిల్లాలో 37 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పటికే ఎండల తీవ్రత పెరుగు తుండటంతో భానుడి తాపానికి ప్రజలు అల్లాడి పోతున్నారు. ఎండలు పెరుగుతు ఒడటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. పనులుంటే ఉదయం 11 గంటల లోగా ముగించుకోవాలని సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండవచ్చని, వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉంటాయని, అలాగే పొలాలకు పనులపైన వెళ్లిన రైతులు, ఉపాధి కూలీలు, పనులు చేసే కార్మికులు ఆరుబయట పొలాల్లో గుంతల్లో ఉన్న వేడి నీళ్ల గానీ, కలుషిత నీళ్ల తాగొద్దని వైద్యాధికారులు చూసిస్తున్నారు. అలాత్రాగటం వలన అతిసారా, డయోరియా వంటి వాటికీ లోనై అస్వస్థతకు గురౌతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా ఓ ఆర్ ఎస్ ద్రావణం, మజ్జిగ వంటివి ఎక్కువ తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. అలాగే ఉపాధి కూలీలు పనులు చేసే చోట వారికీ అవసరమైన చలువ పందిళ్లు, త్రాగు నీటి సౌకర్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వడ దెబ్బ తగులకుండ ముందస్తు చర్యలు..

- డాక్టర్ ఆర్.వెంకట రమణ, డిఎం హెచ్ఓ

జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖా తరుపున అన్ని రకాల చర్యలు తీసుకుంటు న్నాము. ప్రతి పిహెచ్‌సిలోను, సిహెచ్‌సిలోను వడదెబ్బ తగిలిన వారికి ప్రాథమికంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చాము. ప్రతి పిహెచ్‌సి, సిహెచ్‌సి లోను ఓఆర్ఎస్, ప్యాకేట్లు, ఓఆర్ఎస్, ద్రావణం వంటివి అందు బాటులో ఉంచాం. ఎక్కువగా ఎండలు ఉన్నపుడు ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోని తనదైనందిన జీవితంలో పనులు చేసు కోవాలి. సాధ్యమైనంత వరకు ఉదయమే పనులు పూర్తి చేసుకో వాలి. ఎండ కాలం సిల్క్ దుస్తులు కాకుండా కాటన్ దుస్తులు వాడితే మంచిది. సన్ స్ట్రోక్ తగిలితే వెంటనే దగ్గరలో ఉన్న పిహెచ్‌సి, సిహెచ్‌సిల దగ్గరకు తీసుకెళ్లి వైద్యం అందించాలి.

వాలంటీర్లది స్వచ్ఛమైన సేవ

- ప్రతిపక్షాలు అభివృద్ధిని ఓర్వలేక పోతున్నాయి
- వచ్చేది మన ప్రభుత్వమే
- మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ
- వాలంటీర్లకు పురస్కారాల ప్రదానం చేసిన మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-డోన్

వాలంటీర్లది స్వచ్ఛమైన సేవ అని , ప్రతిపక్షాలు తమ ప్రభుత్వం వస్తే వాలంటీర్ వ్యవస్థ తొలగిస్తాం అని ప్రకటనలు చేస్తున్నాయని, ఎందుకంత ద్వేషం, కసి అని ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కొత్త బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన 'అమరజీవి పొట్టిశ్రీరాములు' విగ్రహాన్ని , పాత బస్టాండ్ వద్ద 'జాతిపిత మహాత్మగాంధీ' విగ్రహాన్ని శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించు కున్నారు. అనంతరం సాయి ఫంక్షన్ హాల్ లో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో నియోజకవర్గంలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి పురస్కారాలు అంద జేశారు. మంత్రి మాట్లాడుతూ టిడిపి జన్మభూమి కమిటీల లాగా లంచాలు తీసుకున్నారా? చేసే ప్రతి పనికి చేయి చాచారా?కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా సేవ చేసిన వారిపై కక్షా? అని ప్రశ్నించారు. 2,60,000 మంది వాలంటీర్లలో 48 శాతం బిసిలు, ఎస్‌సిలు 27 శాతం, ఒసిలు 18 శాతం, ఎస్‌టిలు 7 శాతం ఉన్నారని, అందులో సగం మహిళలు ఉన్నారని తెలిపారు. డోన్‌లో నది లేదు..కానీ ఇసుక మాఫియా అని విపక్షాల వింత విమర్శలు చేయడం సరికాదన్నారు. చెప్పింది చేసేవాడు జగన్..చెప్పిందేదీ చేయకపోతే చంద్రబాబు వరుస ప్రారంభోత్సవాల మీద వణుకు పుట్టి పిచ్చి కామెంట్లు, చెత్త మాటలు గెలుస్తామో లేదోనని పూర్తి కాకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నామంటున్నారని అన్నారు. ముందు నీ సీటుకు నీ ఎసరు పెట్టారు..ముందు అది కాపాడుకో అని టిడిపి డోన్ ఇన్‌ఛార్జికి సూచించారు. అబ్బిరెడ్డివారిపల్లి చెరువులో నీరొచ్చినా నీరు నింపడం పూర్తి కాలేదంటారని, పూర్తైన రోడ్ల మీద ప్రయాణిస్తూ పూర్తి కాలేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మార్చి 7న 100 పడకల ఆస్పత్రిలో వైద్య సేవలు, భవనం పూర్తయి ప్రారంభిస్తే పూర్తి కాలేదని పుకార్లు సృష్టిస్తున్నారని, డోన్ లో కేంద్రీయ విద్యాలయం..మీ చిన్నారులకు వరంలాంటిదన్నారు. ఉనికి కోసం కునికిపాట్లతో టిడిపి పాట్లు..అర్థం లేని కామెంట్లు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. డోన్ నియోజకవర్గ వాలంటీర్ల సేవలకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కార ప్రదానం చేశామన్నారు. అందుకోసమే పాత బస్టాండు సెంటర్ లో మహాత్మ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించామని, ప్రజలకు

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన తదితరులు

ప్రభుత్వ సేవలు క్షేత్రస్థాయికి చేరాలన్నది మహాత్ముడి స్వప్నం, ఆ ఆలోచనలను ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ పరిపాలన, అవినీతికి ఆస్కారం లేకుండా సేవలందించే విధానమే వాలంటీర్ వ్యవస్థ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఏదైనా సాధ్యం, వాలంటీర్లు ఏం భయపడొద్దు..బాధపడొద్దు వచ్చేది మనమే ఫ్యాను ఇంట్లో ఉండాలి, సైకిల్ బయటుండాలి, టీ గ్లాస్ సింకులోనే ఉండాలని మంత్రి అన్నారు.

డోన్ ఎంతో అభివృద్ధి చెందింది

-డోన్ వాలంటీర్ లావణ్య

ప్రభుత్వ పురస్కారం మాకు మరింత ప్రోత్సాహకరం మా వార్డులో ఒకరికి రేషన్ కార్డు చేతిలో పెడితే చేతులెత్తి మొక్కారు. వృద్ధులకు పింఛన్ కష్టాలు సీఎం జగన్ వచ్చాక తొలగిపోయాయి. డోన్ లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చేశారు.

బుగ్గన లాంటి నాయకుడు అరుదు

- డోన్ మండల వాలంటీర్ మనోజ్

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ లాంటి నాయకుడు రాజకీయాలలో అరుదు. ప్రతిపక్షటిడిపి నాయకులు కూడా చేతులెత్తి నమస్కరించేలా మంత్రి బుగ్గన వ్యక్తిత్వం. ప్యాపిలి, డోన్ మండలాల వెనకబాటు చూసి ఎంతో బాధపడేవాడిని.

ఈ కార్యక్రమంలో జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేశ్, మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపిపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, డోన్ మున్సిపల్ కమిషనర్ జయరాం, డోన్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ లు జాకీర్ హుస్సేన్, హరికిషన్, డోన్ వైసిసి నాయకులు మల్లెంపల్లే రామచంద్రుడు, డోన్ మున్సిపల్ కౌన్సిలర్లు దినేష్ గౌడ్, ఉమామహేశ్వరి, డోన్ నియోజకవర్గ వాలంటీర్లు, తదితరులు

రైతులపై కాల్పులు జరిపిన..

బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించండి

- రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్

నిరసన తెలుపుతున్న రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కాల్పులు జరిపిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ధనుంజయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న అధ్యక్షతన శుక్రవారం సాయి బాబా నగర్ సెంటర్ లో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దులోని హర్యానా ప్రాంతంలో ఖనౌరీ, శంభు సరిహద్దులలో హర్యానా పోలీసులు కేంద్ర బలగాలు క్రూర తంగా జరిపిన కాల్పులలో బల్లో గ్రామానికి చెందిన శుభకరన్ సింగ్ పోలీస్ కాల్పులలో మరణించడం, ఇంకా అనేక మంది రైతులకు కూడా తీవ్రంగా గాయాలు అయ్యాయని తెలిపారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలుపరచాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు నిర్లక్ష్యంగా అమానుషంగా లాఠీచార్జీలు, ప్లాస్టిక్ బుల్లెట్లు, టియర్ గ్యాస్ షెల్స్‌తో సహా మితిమీరిన బలప్రయోగం దారుణమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కార్మికులు, రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్నా, నారాయణమ్మ, ఎర్రి స్వామి, మాబు, మురళి, శీను, నాగరాజు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో... బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల పోరాటానికి ప్రజలంతా అండగా నిలబడాలని, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరుతూ శుక్రవారం నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్‌లో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి కే మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శులు పి.వెంకట లింగం, బాల వెంకట్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులపై కక్షపూరితంగా వ్యవహరించడం దుర్మార్గమని, గతంలో పోరాటం చేసే సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువులు ధరలు తగ్గించాలని, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ జరిగే ఉద్యమాన్ని కర్కశంగా నీటి ఫిరంగులు, భాస్పవాయువు, బుల్లెట్లతో రైతుల పైన దాడికి పాల్పడడం రైతులు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. **మిగతా 6వ పేజీలో...**

ఆత్మకూరు : నిరసన తెలుపుతున్న నాయకులు

తల్లీ ఇద్దరు కూతుర్లు అదృశ్యం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

తల్లి ఇద్దరు కూతుర్లు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. గురువారం సాయంత్రం16.00 గంటల సమయంలో కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన పరదేశి చంద్రకళ వయస్సు (22) ఆమె ఇద్దరు కూతుర్లు వర్షిణి, ప్రణవిలతో కలిసి అంగడికి పోయి వస్తానని చెప్పి వెళ్ళి ఇంటికి తిరిగిరాలేదని సదరు తప్పిపోయిన మహిళ తల్లి కొప్పెర చిన్న వెంకటమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కొలిమిగుండ్లలో కేసు నమోదు చేసిన్నట్లు సీఐ గోపీనాథ్ రెడ్డి తెలిపారు.

తల్లీకూతుళ్ల ఫైల్ ఫోటో

ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

- జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం క్రింద పేదల పేరిట రిజిష్టర్ చేసిన 8,000 ఇళ్ల పట్టాలను జిల్లా కలెక్టర్ డా.శ్రీనివాసులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిరుపేదలకు రిజిస్టర్ చేసిన ఇంటి స్థలం కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ ఖాజీ అబుల్ కలాం తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ ఖాజీ అబుల్ కలాంలు లబ్ధిదారులకు రిజిస్టర్ చేసిన కన్వేయన్స్ డీడ్స్, ఇళ్ల పట్టాల పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లికార్జున రెడ్డి, తాసిల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

వైసిపి నేతను పరామర్శించిన ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ భర్త వైసిపి నాయకులు ఈసారి ఎల్లయ్యను వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పరామర్శించారు. శుక్రవారం పట్టణంలోని శివ నంది నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వైసిపి నాయకులు బూత్ కమిటీ కన్వీనర్ ఈసారి ఎల్లయ్యను కాటసాని ఓబులేటి పరామర్శించారు. ఇటీవల ఎల్లయ్యకు గుండెపోటు రావడంతో నంద్యాల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయి స్వగృహానికి తిరిగి రావడంతో విషయాన్ని తెలుసుకున్న ఓబుల్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకన్నారు. రియల్ ఎస్టేట్ మమ్మదా, ఈసారి కుమార్, ముర్తూజ హుస్సేన్, పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అలి అబ్బాస్, పా ముల పుల్లయ్య, రాము, రమణతదితరులు ఉన్నారు.

వైసిపి నాయకుని పరామర్శిస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రమాదాల నియంత్రణకు

పటిష్ట భద్రతా చర్యలు చేపట్టండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, ఆర్‌టిఓ జి.వి. శివారెడ్డి, డిఎస్పీలు,మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. శాంతిరాం మెడికల్ కళాశాల, చాబోలు క్రాస్, అయ్యలూరు మెట్ట, ఆళ్లగడ్డ లోని అహోబిలం క్రాస్, ఏవి గోడౌన్స్, బలపనూరు క్రాస్ తదితర జాతీయ రహదారుల్లో రహదారి ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఎన్హెచ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులు పూర్తిచేసి సంబంధిత నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వై జంక్షన్ నుండి ఐటీసీ వరకు మూడు రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ని కలెక్టర్ ఆదేశించారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ద్విచక్ర వాహనదారులు బిఐఎస్ హెల్మెట్ లనే వాడే విధంగా చర్యలు తీసుకోవాలని తదితర అంశాలపై అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణకు సూచించిన భద్రతా చర్యలు చేపట్టలేదని జాతీయ రహదారుల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఇలాగే వ్యవహరిస్తే టోల్గేట్ మూసివేతకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ఫుట్ పాత్ లపై దుకాణదారులు ఆక్రమించకుండా పాదాచారులు నడిస్తే రోడ్లపై ప్రమాదాలు నివారించవచ్చని ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల్లో 8 హైవే పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో గత రెండు సంవత్సరాలతో పోలిస్తే భద్రతా చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాల బారిన పడిన మరణాల సంఖ్యను తగ్గించగలిగామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

మండలాల్లో జొన్నలు కొనుగోలు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సివిల్ సప్లై ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాలు మండల సెంటర్లలో ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని ఆర్ఎస్ రోడ్‌లో ఉన్న వేర్ హౌస్‌ల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఏ సురేష్ శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్ సంబదిత రైతులను సందర్శించి వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో పాణ్యం, కోయిలకుంట్ల, సంజామల ఆళ్లగడ్డ ,సిరివెళ్ల, రుద్రవరం,గడివేముల, నంద్యాల తదితర మండలాల్లో ఈ సంవత్సరం జొన్న పంటను విస్తారంగా వేశారన్నారు. గతంలో 45 క్వింటాళ్లు ఎకరాకు దిగుబడి వచ్చేవని ఈ సంవత్సరం 20, 25 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదన్నారు. ప్రభుత్వం క్వింటాలు 3180 రూపాయలు మద్దతు ధర ప్రకటించినాకానీ అధికారులు పంటలు వచ్చే సమయానికి అన్ని రకాల ఏర్పాట్లను సకాలంలో చేసుకోకపోవడంతో రైతుల నుంచి కొనుగోలు ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. తగినన్ని సంచులు అందుబాటులో లేకపోవడంతో జొన్నలను మార్కెట్‌కు తెచ్చిన రైతులు రెండు మూడు రోజులు మార్కెట్ యార్డు దగ్గరే కాపుకాయ వలసిన పరిస్థితి ఏర్పడు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఒక క్వింటాలు జొన్నలు మార్కెట్ తెచ్చుటకు హమాలీ లగేజీతో కలిపి రూ.100 ఖర్చు అవుతుందని కానీ అధికారులు మాత్రం క్వింటాలకు పది రూపాయలు మాత్రమే రూ 10 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, వెంటనే ప్రభుత్వం సివిల్ సప్లై ద్వారా అన్ని మండల కేంద్రాలలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, హమాలీ ఖాతా ఖర్చులు ట్రాన్స్పోర్ట్ లగేజీ ఖర్చులు ప్రభుత్వమే పూర్తిగా భరించాలని డిమాండ్ చేశారు.

జొన్న రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్

'జగనన్న ఆరోగ్య సురక్ష వరం'

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు పేదలకు వరమని సర్పంచు నిత్యలక్ష్మీదేవి, వైద్యురాలు దీపానాగవేణీలు అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలనందు రెండవ విడత ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజల చెంతకు వైద్య శాఖను రప్పించి వారి ద్వారా ఉచిత వైద్యం అందించడం పేదలకు వరం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 402 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యశాలకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ వైద్య క్యాంపులు ఏర్పాటు చేయడం గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహమ్మద్ బేగ్, విజయేంద్ర, సీహెచ్ బాలకష్ణయ్య, కంటివైద్య నిపుణులు షేక్షావలీ, ఎంపిటీసీ సభ్యుడు బాలరాజు, వైఎస్సార్సీపీ నాయకుడు నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ నారాయణ ఆచారి, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల కోసమే సిఎంకు మరో 2 హెలికాప్టర్స్

- మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి బనగానపల్లె

భద్రత కోసం కాదని ఎన్నికల ఛాంపియన్ కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరో రెండు హెలికాప్టర్లను అద్దెకు తెచ్చుకున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ జనార్ధన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రతీ సభలో పేదలు వర్సెస్ పెత్తందారులు అని చెప్తున్నారని, జగన్ రెడ్డి ఈ మాటలు మాట్లాడడానికి కనీస అర్హత కూడా లేదన్నారు. ఒకవైపు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే జగన్ రెడ్డి మాత్రం స్వప్రయోజనాల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ రెడ్డికి ఒక హెలికాప్టర్ ఉందని ,రానున్న ఎన్నికల క్యాంపైన్‌కు ఉపయోగించుకునేందుకు భద్రతను సాకుగా చూపి ప్రజల సొమ్ముతో హెలికాప్టర్‌ను లీజ్‌కు తీసుకున్నారని బీసీ విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు సరైన రోడ్లు లేక ఇబ్బంది పడుతుంటే, మరో వైపు పెత్తందారు సిఎంకు 20 కి.మీ.లకు కూడా హెలికాప్టర్ కావాల్సి వచ్చిందని విమర్శించారు.

వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 16వ వార్డులో పట్టణ తెలుగు యువ నాయకులు ప్రభు కుమార్ ఆధ్వర్యంలో నందికొట్కూరు మండలంలోని అల్లూరు మాండ్ర శివానందరెడ్డి స్వగ్రామంలో రాంబాబు, రాజేష్,రవి,సంజీవ, రాజేష్,వరుణ్, షణ్ముఖ,బాలు, వైసీపీని వీడి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ మాండ్ర కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన నచ్చక వారంతా తమ పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో జయ సూర్య, పలు చాని మహేశ్వర్ రెడ్డి,బ్రహ్మయ్య,సతీష్.ఫై జు ల్లా హుస్సేన్, మట్ట, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో జడ్పిటిసి పుల్యాల దివ్య ,సర్పంచ్ శేషన్న

క్రీడాస్ఫూర్తితోనే విజయం : జెడ్పిటిసి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి క్రీడాకారుడికి క్రీడా స్ఫూర్తి కలిగినప్పుడే విజయం వరిస్తుందని జెడ్పిటిసి పుల్యాల దివ్య అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సీనియర్ ఖోఖో క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పిటిసి మాట్లాడారు. క్రీడాకారులకు సమయస్ఫూర్తి క్రీడా స్ఫూర్తి క్రమశిక్షణ కలిగినప్పుడే విజయాలు వరిస్తాయన్నారు. క్రీడాకారులకు పట్టుదల, దీక్ష, నైపుణ్యత తప్పని సరి అన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచినప్పుడే ఆ క్రీడా కారుడు ఉన్నత శిఖరాలు అవరోధిస్తారన్నారు. క్రీడలు పాల్గొడం వలన శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసము కలుగుతాయ న్నారు. ఖోఖో క్రీడాల్లో దాదాపు 8 రోజులు శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను కనపరిచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు విజయాన్ని అందించాలని ఆమె కోరారు. సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న మాట్లాడుతూ పుల్యాల నాగిరెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ అయినప్పటి నుంచి ఖోఖో క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మంచి విజయాలు సాధించాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిం చడంలో నాగిరెడ్డి ముందంటారని వారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ తరపున 15 క్రీడాకారులకు క్రీడా దుస్తులను జడ్పిటిసి పుల్యాల దివ్య చేతులమీదుగా అందజేశారు. ఖోఖో అసోసియేషన్ సెక్రెటరీ ప్రభాకర్ మాట్లాడుతూ 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగు పశ్చిమగోదావరి జిల్లా సామర్లకోటలో జరుగు ఖోఖో క్రీడా పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున క్రీడాకాలు పాల్గొంటారన్నారు. శ్రీ తోకల పితాంబ రెడ్డి, కోచ్ శివ, కారులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో అభివృద్ధి, సంక్షేమం

- డోన్ టిడిపి ఇన్చార్జ్ మన్నే ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం టిడిపి తోనే సాధ్యమని డోన్ టిడిపి ఇన్చార్జ్ మన్నే ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగం గా 8వ వార్డులో శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ కర పత్రాలు పంపిణీ చేశారు. టిడిపి మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు ప్రజలకు వివరించారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తామన్నారు. రానున్న ఎన్నికలలో టిడిపిని గెలిపించుకో వాలన్నారు. ఈ కార్యక్రమం లో గౌతమ్ రెడ్డి,మురళి కృష్ణ గౌడ్, రాఘవేంద్ర,అంకిరెడ్డి, రామ్మోహన్ యాదవ్, సుంకయ్య, కొంగనపల్లి మధు, పెద్ద రామంజి,మల్లికార్జున, ఎస్కేవలి, శివ కిషోర్, బ్యాంక్ శీను,ప్రతాప్, మౌలాలి రెడ్డి,పుల్లారెడ్డితదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

తేనె టీగల పెంపకంలో రాణిస్తున్న ఉప సర్పంచి

- నిరుద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న సోహెల్

- తేనె ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - చాగలమర్రి

తేనె తయారీలో ఉప సర్పంచ్ సోహెల్

తేనెటీగలకు మకరందాన్ని ఇస్తున్న ప్రొద్దు తిరుగుడు పూలు

పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చని చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్ నిరూపించారు. ఆయన రాజకీయాల్లోనే కాక.. తేనె టీగల పెంపకంలోనూ రాణిస్తున్నాడు. స్వయం ఉపాధి కింద చాగలమర్రిలో తేనె ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగ యువకులకు ఆదర్శంగా నిలిచారు. చాలామంది చదువుకున్న నిరుద్యోగ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తుంటారు. కానీ సోహెల్ దానికి భిన్నంగా బయోటెక్నాలజీ చదివి స్వయంగా జీవించాలన్న గొప్ప ఉద్దేశంతో తమ సొంత పొలంలోనే తేనె ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ కల్చర్ కింద హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ టెక్నాలజీ సెంటర్లో శిక్షణ పొంది ఆరు నెలల క్రితం ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశానన్నారు. ద్వారానే ఏపీ కల్చర్ ద్వారానే తేనెటీగలు తెచ్చి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. తేనెటీగలు పెంచుటకు 10 బి.హైవ్ పెట్టలను ఏర్పాటు చేశామన్నారు. ప్రొద్దు తిరుగుడు పంట పొలంలో తేనె ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించినట్లు ఆయన తెలిపారు. ఈ పంటలో తేనెటీగలు తిరుగుతూ ప్రొద్దుతిరుగుడు పూల నుండి మకరందాన్ని పుప్పడిని తీసుకొని తిరిగి ఆ బాక్సులలోకి వచ్చి చేరుతాయన్నారు. ఆర్గానిక్ పద్ధతి ద్వారా తేనెను ఉత్పత్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎపిస్ మిల్లీఫెరా రకం తేనెను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఈ తేనె ఎప్పటికీ చెడిపోదని, సీజన్ను బట్టి రంగు రుచి మారుతూ ఉంటాయన్నారు. సెంట్రీ ఫీజు ద్వారా తేనెను తీస్తామని మొత్తం పది పెట్టల ద్వారా 45 రోజులలో 20 నుండి 30 కేజీల తేనె దిగుబడి అవుతుందని ఆయన వివరించారు. ఈ తేనె ధర మార్కెట్లో కిలో 550 రూపాయల వరకు ఉంద న్నారు. పంట పొలాల్లో సాధారణంగా చాలామంది నిప్పు పెట్టి తేనెను తీస్తుంటా రని, దీనివల్ల తేనెటీగలు చనిపోతాయని ఆయన తెలిపారు. అంతేగాక చాలామంది రైతులు పంటలపై అధికంగా రసాయనిక ఎరువులు పురుగుమందులు వాడుతూ ఉండటంతో కూడా తేనెటీగలు ప్రకృతిలో అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీకల్చర్ విధానం ద్వారా తేనే ఉత్పత్తి చేయడం వల్ల తేనెటీగలకు ఎలాంటి హాని ఉండబోతున్నారు. ఇంకా తేనెటీగల సంతానం ఉత్పత్తి అవుతుందని ఆయన చెప్పారు. నిరుద్యోగ యువకులు తేనెటీగల ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ఉత్సాహం చూపాలని సూచించారు. అలాంటి యువకులకు తమ వంతు సూచనలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.జాతీయ తేనెటీగల పెంపకాని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'అమూల్ హనీ'ని, మధుక్రాంతి పోర్టల్‌ను ప్రారంభించింది.

జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్ (NBHM)

ప్రభుత్వం దేశంలో "తీపి విప్లవం" లక్ష్యాన్ని సాధించడానికి మిషన్ మోడ్‌లో శాస్త్రీయ తేనెటీగల పెంపకం యొక్క మొత్తం ప్రచారం, అభివృద్ధి కోసం భారతదేశం 2 సంవత్సరాల పాటు "నేషనల్ తేనెటీగల పెంపకం, హనీ మిషన్ (NBHM)" పేరుతో కొత్త కేంద్ర రంగ పథకాన్ని ఆమోదించింది. సామర్థ్యం పెంపుదల, శిక్షణలు, మహిళలపై నిర్దిష్ట దృష్టి, ప్రమోషన్, ఉత్పత్తికి ఇన్‌పుట్ మద్దతు, ఇంటిగ్రేటెడ్ తేనెటీగల పెంపకం అభివద్ధి కేంద్రాల (IBDC\T), ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటు, డిజిటలైజేషన్/ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మొదలైనవి ఈ పథకం ఉద్దేశం. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ 28.09.2021న 'అమూల్ హనీ'ని ప్రారంభించారు. మధుక్రాంతి పోర్టల్‌ను ప్రారంభించారు.

వార్డు ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ దార సుధీర్

27వ వార్డులో పర్యటించిన దార సుధీర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్, వార్డు ఇంచార్జ్ ఉస్మాన్ బేగ్ ఆధ్వర్యంలో నందికొట్కూరు వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త, డాక్టర్ దార సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగనన్న చేస్తున్న మంచిని గుర్తించి 2024 ఎన్నికల్లో ఆశీర్వ దించాలన్నారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, నందికొట్కూరు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు కేశవరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, మైనారిటీ జోనల్ ఇంచార్జ్ అబూబక్కర్, వైసీపీ జిల్లా ఎక్జిక్యూటివ్ సభ్యురాలు సులోచనమ్మ, శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్ కౌన్సిలర్ లు మనపాడు అశోక్, అబ్దుల్ రవూఫ్, చాంద్ బాషా, కాటెపోగు చిన్న రాజు, లాలు ప్రసాద్, చెరుకు సురేష్, రజిని కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, దేశెట్టి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ బొల్లెద్దుల రామక్రిష్ణ, కురువ శ్రీను, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డూ, శమీవుల్లా, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకనుగుణంగా అన్న ప్రసాదం

ప్రజాశక్తి - శ్రీశైలం

మార్చి 1వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులరద్దీకి అనుగుణంగా అన్న ప్రసాద వితరణలు ఏర్పాటు చేయడం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. మహా శివరాత్రి ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ భవనంలో అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాదన్న వితరణ కార్యక్రమం గురించి కొంతమంది భక్తులతో అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మోత్సవాలలో సాధారణ భక్తులకు, శివ స్వాములకు, ఉత్సవాలలో ప్రత్యేక విధులు నిర్వహించేందుకు వచ్చిన సిబ్బందికి, ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే కళాకారులకు మొదలైన వారందరికీ ఎటువంటి లోటుపాట్లు లేకుండా లేకుండా అన్న ప్రసాద అందే విధంగా చూడాలన్నారు. భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా ఉండే విధంగా అందిస్తూ ఉండాలన్నారు. ఉత్సవాల సమయంలో క్షేత్ర పరిధిలో స్వచ్ఛంద సేవాకర్తలు కూడా అన్నదాన కార్యక్రమాన్ని పలుచోట్ల నిర్వహిం చడం జరుగుతుందన్నారు. అటువంటి సంస్థలకు దేవస్థానం సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్న ప్రసాద భవనాన్ని వంటశాలను వంట పాత్రలను పరిశీలించారు. వీటిని తరచూ శుభ్రం చేస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు.

లక్ష విస్తరాకుల విరాళం : శ్రీశైల క్షేత్రంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి వినియోగించేందుకుగాను చీరాల భ్రమరాంబ సేవాసమితి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజుకు అన్నపూర్ణ భవనంలో లక్ష విస్తరాకులను అందజేశారు. విస్తరాకుల విలువ మూడు లక్షలు రూపాయలు ఉంటుందని దాతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఇస్తరా కులను విరాళంగా ఈ సంస్థ అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ భవనం సహాయ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్, పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డి, చీరాల భ్రమరాంబ సేవా సమితి అధ్యక్షురాలు ఎంవీ మహాలక్ష్మి సేవా సమితి ప్రతినిధులు శివ సేవకులు పాల్గొన్నారు.

భక్తులతో మాట్లాడు తున్న ఇఒ పెద్ది రాజు

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి - బనగానపల్లె

యూటీఎఫ్ నాయకులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

ఈనెల 27న జేఏసీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడంతో పోలీసులు విజయవాడకు వెళ్లవద్దని అనుమతి లేదని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే సత్య ప్రకాష్, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎన్ ప్రతాప్‌లకు శుక్రవారం నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమా నికి ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఒకవైపు చర్చలకు పిలుస్తూనే, మరోవైపు నోటీసులు అందిం చడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం దారుణం అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను యుటిఎఫ్ పక్షాన ఖండిస్తు న్నామన్నారు. ఏప్రిల్ నెలలో జరగబోయే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ ను రద్దు చేసి, ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లిస్తామని మానిఫెస్టోలో ప్రకటిస్తారో వారికే మా ఓటు, మా కుటుంబ సభ్యుల ఓటు అని తెలిపారు. పోలీస్ శాఖ ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించడం మానుకోవాలన్నారు.

25న మంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని మంగ పల్లి గ్రామంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటీ తరపున 25వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు దస్తగిరి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో గుండె జబ్బులు బీపీ షుగర్ ఊపిరితిత్తుల వ్యాధులు శ్రీ వ్యాధులు ఎముకలు కింద వ్యాధులు కంటి జబ్బులు చెవి ముక్కు గొంతు వ్యాధులు చర్మవ్యాధులకు డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు దస్తగిరి రెడ్డి తెలిపారు. సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాలకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు వచ్చి పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకువెళ్లాలని దస్తగిరి రెడ్డి కోరారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోస్టాఫీస్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పోస్ట్ ఆఫీస్‌లో అందించే సేవలపై విద్యార్థులకు ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ మౌలీశ్వర రెడ్డి అవగాహన కల్పించారు. పట్టణంలోని రామాలయం వీధిలో ఉండే భారతి విద్యా మందిరం పాఠశాల విద్యార్థులు పోస్ట్ ఆఫీస్‌కు వచ్చి పోస్ట్ ఆఫీసులో ఎలాంటి సేవలు లభిస్తాయి... ఏయే తపాల బిల్లలు లభిస్తాయి అనే విషయాలు తెలుసుకునేందుకు వచ్చారు.. వారికి పోస్టల్ ఇన్స్పెక్టర్ మౌలీశ్వర రెడ్డి పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ కార్డు, ఇన్ లాండ్ లెటర్ (మూత కవర్) అలాగే పోస్టల్ స్టాంప్‌ల గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. అలాగే ఉత్తరాలు ఎలా డెలివరీ అవుతాయి.. పోస్ట్‌మెన్ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, నవ్య శ్రీ, పోస్ట్ మాస్టర్ రవిచంద్ర రెడ్డి, సుబ్బరాయుడు, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

పోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని గుంతపాలె వీధిలో ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. స్థానిక కాలనీలోని క్రీడామైదానంలో తెదేపా చాగలమర్రి యువనాయకులు ఎంఎస్ షమియుద్దీన్, కొలిమి ఉసేన్వలి పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 24జట్లు ఈ పోటీల్లో ఆడనున్నారన్నారు. ప్రథమ బహుమతి రూ.20వేలు కొలిమి బ్రదర్స్ ద్వితీయం రూ 110వేలు ఎంబి. వసీం, ఇర్షాద్, తృతీయం రూ 7వేలు సోనూ, సిరాజ్, నాల్గవ బహుమతి రూ.4వేలు ఆకుల ఇర్షాద్లు అందజేయనున్నారు. పీడీ దాదాపీర్, నిర్వాహకులు ఇంతియాజ్, రియాజ్, సర్ఫరాజ్, ఉసేన్వలి పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

ఎన్నికల అంశాలపై నిఘా : జిల్లా కలెక్టర్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి, పక్కన జిల్లా ఎస్పీ డిఆర్‌ఓ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ఖచ్చితమైన నిఘా వుంచి ప్రతి విషయాన్ని నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు -2024లో భాగంగా ఎంసిసిటీ, ఎస్ఎస్టి, వివిస్టి, వివిటి, ఎఫ్ఎస్టి టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎస్ఎస్టి, వివిస్టి, వివిటి, ఎఫ్ఎస్టి, ఎంసిసి టీమ్ అధికారుల పాత్ర కీలకమైందని, భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకలను తు.చ తప్పక పాటించి విధులు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీంలను ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయిలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో పూర్తి అవగాహన పొంది ప్రతి సందేహాన్ని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక ఆయా టీంల అధికారులు అన్ని విధాల సన్నద్ధమై ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలన్నారు. టీమ్ అధికారులు అప్రమత్తంగా వుండి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఏ రోజు వచ్చిన ఫిర్యాదులను ఆ రోజే పరిశీలించి రిపోర్టులు ఇవ్వాలన్నారు.

జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో శాంతి భద్రతలు పక్కాగా అమలు పరచేందుకు ఎస్ఎస్టి, వివిస్టి, వివిటి, ఎఫ్ఎస్టి, ఎంసిసి టీమ్ అధికారులు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నోటిఫికేషన్ నుంచి అమలులో ఉంటుందని, ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిం చేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులకు అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్యలు, సందేహాలు నెలకొన్నా తమ దృష్టికి తీసుకురావాల న్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎ. పద్మజ, ఎస్ఎస్టి, వివిటి, ఎఫ్ఎస్టి, ఎంసిసి టీం ల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో రానున్న వేసవికాలంలో వర్షాభావ పరిస్థితుల దృశ్య నీటి నిలువలు రిజర్వాయర్లలో సరిగా లేవని పొదు పుగా వాడుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశ భవనం నందు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సభలో చదివి వినిపించి ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీ నరసింహ మాట్లాడుతూ ఈ సంవత్సరము భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయని తాగునీటి లభ్యత తక్కువ ఉండడం వల్ల పొదుపుగా నీటిని వాడుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నా మన్నారు. జల్ జీవవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కులాయి ద్వారా నిర్మించేందుకు ఖాతాలు తెరవడం జరిగిందని త్వరలోనే అన్ని గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఇందిరా క్రాంతి పదం వెలుగు పథకం ఏపీవో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడతలో 19 కోట్ల 70 లక్షల రూపాయలను పొదుపు మహిళల ఖాతాల్లో ప్రభుత్వం చేయడం జరిగిందని, శ్రీనిధి ద్వారా రూ.50 లక్షల రుణాలు అందించడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం ఒక కోటి 10 లక్షలు రుణాలు అందివ్వడం జరిగిందని నంద్యాల జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నామని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు తమ తమ అభివృద్ధిని వేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ ముంతల మధురాని ఏవో అని ఖాన్, జడ్పిటిసి తులసమ్మ, డిటి హరిత, వ్యవసాయ శాఖ ఏవో స్వాతి, హౌసింగ్ డిఇ సుంకిరెడ్డి, పిఆర్ ఏఈ వెంకటయ్య, ఎంపిటీసీ కొర్రపోలు అర్జున్, వెంకటమ్మ, చైతన్య పుష్పావతి సర్పంచులు ఎరుకలి సంధ్య, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డి చిన్న సంజీవరెడ్డి

రైతులపై కాల్పులు జరిపిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించండి

5వ పేజీ తరువాయి.. ఎన్నికల్లో ప్రజలంతా మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని, రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడలో లేవని అన్నారు. ప్రజలంతా మరింత ఐక్యంగా ఢిల్లీ రైతాంగ పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు.

ఆత్మకూరు : కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతుల పైన విరుచుకుపడి ప్రాణాలు తీస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం బస్టాండ్ ఎదుట హర్యానాలో పోలీసుల రబ్బరు తూటాలకు మరణించిన యువరైతుకు నివాళులు అర్పిస్తూ, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న రైతులపై పోలీసు బలగాలను ప్రయోగించి ప్రాణాలు తీస్తుందన్నారు. దేశానికి రైతులకు, దళితులకు, మైనార్టీలకు అన్యాయం చేస్తున్న బిజెపికి అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాభాష, వీరన్న, సిఐటియు నాయకులు ఇస్మాయిల్, సురేంద్ర, శివకుమార్, రాము, రవి, విజయ్, కార్మికులు, హమాలీలు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని రక్తసిక్తం చేయడాన్ని నిరసిస్తూ రైతు, వ్యాకాస, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు, కూలీలతో కలిసి కర్నూల్ రోడ్ మార్కెట్ యార్డ్ దగ్గర రోడ్డుపై నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. వ్యాకాస జిల్లా సహ కార్యదర్శి పి.పకీరు సాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వ్యాకాస జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డిలు మాట్లాడారు. ఢిల్లీలో రైతులపై పోలీసులు జరి పిన కాల్పులు హేయనీ యమైన చర్య అన్నారు. రైతు, వ్యాకాస, సిఐటియు నాయకులు టి. గోపాలకృష్ణ, సి.నాగన్న, వి.ఆంజనేయులు, ఎం.కర్ణ, వి.శ్రీనివాసులు, ఏసేపు పాల్గొన్నారు.

రైతు ప్రాణాలు తీసే బిజెపిని గద్దెదించండి

డోన్‌లో సిఐటియు, ఎపి రైతు సంఘం రాస్తారోకో

ప్రజాశక్తి-డోన్

యువ రైతు శుభ కరణ్ సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా సుబ్బారాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతుల ప్రాణాలు తీస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. అఖిల భారత కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం డోన్ పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్ అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఏవి.భాస్కర్ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు బి.నాగమద్దయ్య, కోయిలకొండ నాగరాజు ,సిఐటియు నాయకులు చిన్న రహిమాన్ హాజరయ్యారు.

శివరాం, లంకాసుబ్బారాయుడు మాట్లాడారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎర్రన్న, రాము, జబ్బార్, శ్రీను, సుధాకర్, వెంకటేశ్వర్ రెడ్డి,నాగరాజు,నక్కిహరి పాల్గొన్నారు.

26న జిల్లా జయహో బిసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 26వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి జరిగే జయహో బిసి మహాసభ ఏర్పాట్లను జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌తో కలిసి పోలిట్ బ్యూరో సభ్యులు, నంద్యాల నియోజకవర్గం ఇంచార్జ్ ఎన్ ఎం డి ఫరూక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివద్ధి చెందా రంటే అది టీడీపీ పాలనలో చంద్రబాబు కే సారథ్యం లోనే సాధ్యపడిందని అన్నారు.బీసీలకు పెద్దపీట వేసిన చంద్రబాబుకి మళ్ళీ మన మద్దతు తెలిపాలని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గం. లకు జయహో బీసీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విశ్వశాంతి క్రీడాకారులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి 52వ అంతర్రాష్ట్ర హ్యాండ్ బాల్ మహిళల పోటీలకు ఆళ్లగడ్డ విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు ఎంపి కయ్యారు. నంద్యాలలోని రామలింగారెడ్డి డిగ్రీ మహిళా కళా శాల మైదానంలో ఈనెల ఫిబ్రవరి 23, 24 తేదీలలో జరిగేటువంటి పోటీలకు ఆళ్లగడ్డ విశ్వశాంతి స్కూల్ విద్యార్థి నిలు ఇందుప్రియ, శ్రీలక్ష్మి, నిత్య, రజియా, మానస, చర్విత ఎంపికయ్యారు. అలాగే ఎస్ఆర్‌కె స్కూల్ నుంచి హర్షిత ఎంపిక కావడం జరిగింది. వీరు శుక్రవారం రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నారు. శిక్షణ ఇచ్చినటువంటి కోచ్ లు డిపి సుబ్బరాయుడు, పి విక్రమ్‌లను స్కూలు యాజమాన్యం వారు అభినందించింది.